క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన బొలిశెట్టి జయరామ్, సతీమణి. ధనలక్ష్మీ, కుటుంబ సభ్యులు రూ.50,116లను విరాళంగా అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ విరాళాన్ని జయరామ్ అన్న శేలు బొలిశెట్టి గురుప్రసాద్, హైదరమ్మ దంపతుల జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు దాతలను దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేసినట్లు పీవీ కుమార్‌రెడ్డి తెలిపారు.

నేత్ర దానం



నేత్రాలు దానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల : పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ శ్రీరామిరెడ్డి (56) గుండెపోటుతో ఆదివారం మరణించారు. కొడుకు విష్ణువర్ధన్ రెడ్డి సేవా గుణంతో తమ తండ్రి నేత్రాలు దానం చేస్తామని లైఫ్ యువనేత్ర సభ్యులకు తెలపడంతో వారు కర్నూలు ప్రభుత్వ వైద్య శాలకు సమాచారం ఇచ్చారు. వైద్య సిబ్బంది మృతుడు శ్రీరామిరెడ్డి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా తీసుకున్నారు.

డీఆర్ బకాయిలను విడుదల చేయాలి



సమావేశానికి హాజరైన ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు

డోన్ : పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నిరకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యదర్శి భానుసింగ్ డిమాండ్ చేశారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు గత స్మృతులను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు నరసింహులు, పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షులు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, సంఘం నాయకులు చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు నిరాటంకంగా దాతల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేయడం గొప్ప విషయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ అన్నారు. వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో స్థానిక రాధాకృష్ణ స్వీట్స్ యజమాని చిదంబరం ఆదివారం రోగులకు రొట్టె, గుడ్డు, పప్పు, అరటిపండు పంపిణీ చేశారు. ఆసుపత్రి పట్టణ శివారు ప్రాంతాలలో ఉన్నందువల్ల ఇక్కడ రోగులకు ఎలాంటి సౌకర్యాలు లేవని, ఇలాంటి సందర్భంలో ఒక్కపూట పౌష్టికాహారాన్ని అందించడం మామూలు విషయం కాదన్నారు. కార్యక్రమంలో ప్రార్థన సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

విక్రయానికి సిద్ధంగా గణనాథులు



ఇల్లూరుకొత్తపేట వద్ద విక్రయానికి ఉంచిన గణనాథులు

బనగానపల్లె : వినాయక చవితి పండుగ పర్వదీనం ఈ నెల 27న ఉండగా గణనాథులను విక్రయించేందుకు ఇప్పటి నుంచే వ్యాపారులు సిద్ధమవుతున్నారు. మండలంలోని ఇల్లూరుకొత్తపేట వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన సుమారు 200 వరకు వినాయక విగ్రహాలను తయారు చేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. విగ్రహాల సైజును బట్టి రూ.2 వేల నుంచి రూ.40వేల వరకు విక్రయించడం జరుగుతుందని వ్యాపారి సుధాకర్ తెలిపారు. బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం ఉన్నందున ఇక్కడ మట్టితో తయారు చేసిన గణనాథులను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే చాలా గ్రామాల నుంచి అడ్వాన్స్ ఇచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు.

భవన నిర్మాణం పూర్తయ్యేనా?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోటిన్నరతో మండల పరిషత్ భవన నిర్మాణ పనులు ప్రారంభం
- 80 శాతం పనులు పూర్తి
- కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా పూర్తి చేయిన 20 శాతం పనులు
- ఇబ్బందులు పడుతున్న సర్పంచులు, ఎంపీటీసీలు



నిలిచిపోయిన మండల ప్రజాపరిషత్ నూతన భవన పనులు

డోన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవన నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అన్నీ సిద్ధంగా ఉన్నా.. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోడవంతో పనుల్లో వేగం తగ్గిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

80 శాతం పనులు పూర్తి..

పట్టణంలో సెక్రటరియేట్ రహదారిగా పేరుగాంచిన కోర్టు, పోలీసుస్టేషన్‌కు వెళ్లే రహదారి పక్కన 2023 మేలో అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మండల ప్రజాపరిషత్ భవనం నిర్మాణ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. రూ.కోటిన్నర వ్యయంతో ఆధునిక వసతులతో నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణం పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. భవనం నిర్మాణ పనులు 80 శాతం పూర్తికాగా, పై కప్పులకు సంబంధించిన రేకులు కూడా సిద్ధంగా ఉంచారు. అయితే కూటమి ప్రభుత్వం మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



భవనం పైకప్పు కోసం సిద్ధం ఉంచిన రేకులు

ప్రస్తుతం మండల ప్రజాపరిషత్ భవనాన్ని కర్నూలు రోడ్డులోని జిల్లాపరిషత్ గెస్ట్ హౌస్ ఆవరణలో ఉన్న పంచాయతీరాజ్ కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు వివిధ పనుల కోసం వచ్చి వెళ్లేందుకు మండల ప్రజలకు అనువుగా ఉంటుంది. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని నిర్మాణ పనులను సత్వరమే పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలి



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న వెంకట రంగయ్య

కోవెలకుంట్ల: నంద్యాల– యర్రగుంట్ల రైల్వే మార్గంలోని కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరారు. దక్షిణమధ్యరైల్వే జోనల్ వినియోగదారుల కన్సల్టెంట్ మెంబర్ వెంకటరంగయ్య శనివారం రాత్రి స్థానిక రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో వేచి ఉన్న తిరుపతి, అమరావతి ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తోపాటు ప్రజా సంఘాల ప్రత్యేక కృషి వల్ల గుంటూరు–తిరుపతి ఎక్స్‌ప్రెస్, తెలంగాణా రాష్ట్రం నాందేడ్ నుంచి ధర్మవరం వెళ్లే ప్రత్యేక రైలుకు ఈనెల 2వ తేదీ నుంచి కోవెలకుంట్లలో స్టాపింగ్‌కు అనుమతి ఇచ్చారన్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మంచినీటి సరఫరా, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లల సౌకర్యార్థం లిఫ్ట్, రైల్వేస్టేషన్‌కు వెళ్లే రెండు వైపు రహదారులను పునర్నిర్మించాలని, రోడ్ల వెంట వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కోవెలకుంట్ల, బనగానపల్లె రైల్వేస్టేషన్‌లో టికెట్ రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, స్టేషన్లలో రైలు పేర్లతో బోగీల వరుసల క్రమంలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు అమర్చాలన్నారు. సమస్యలను ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు చెప్పారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని ఆయా గ్రామాలకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

గ్రూపు దేవాలయాల చైర్మన్‌గా మారుతీ కృష్ణన్

బేతంచెర్ల : పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గ్రూప్ దేవాలయాల చైర్మన్‌గా ఈవీ మారుతీ కృష్ణన్ ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆలయ కమిటీ సభ్యులుగా ప్రసన్న, శ్రావణ్ కుమార్, సుధామణి, అలివేలమ్మ, వెంకటరమణయ్య, మధు బాబు, దేవినేని బాయి, లక్ష్మిదేవి, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా అర్చకుడు శ్రీనివాస్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో మారుతి కృష్ణన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన చైర్మన్, పాలక మండలి సభ్యులను గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం, హిందూ ధార్మిక సంఘాల సభ్యులు హుసేన్‌రెడ్డి, మధుమోహన్ రెడ్డి, అన్నారావు, నాగ మోహన్ ,పుల్లారెడ్డి, గుండా గోపాల్ తదితరులు సత్కరించారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం గీతా

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెల 26వ తేదీన ఇదే పాఠశాల క్రీడామైదానంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో బాలుర విభాగంలో నాగ ఉదయ్, హనీఫ్, కాశీం, నిఖిల్, అభినయ్, బాలికల విభాగంలో సాయిప్రియ, నందిని, పావని ప్రతిభ చాటి త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసును హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, డీటీ, ఎంఈఓ

బేతంచెర్ల : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ సోమశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, వైద్యురాలు ప్రియాంక ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయం వంటగది, పరిసరాలను, వాష్ రూమ్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూడుల్స్, చాక్లెట్స్, వంటిజంక్ ఫుడ్స్ తినరాదన్నారు. అలాగే వంట తయారు చేసే వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏమైనా సమస్యలు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్ అబీదా బేగంను ఆదేశించారు.

విద్యార్థుల ప్రాణాలు కాపాడండి

పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థినుల ప్రాణాలు కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్‌ఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గత నెలలో లలిత మాధురి మృతి చెందిన ఘటన మరవక ముందే మరో ఇద్దరు విద్యార్థినులు శనివారం అస్వస్థకు గురయ్యారని తెలిపారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా కారణంగా విద్యార్థినులు అనారోగ్యం బారిన పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మిలకు వినతి పత్రం అందజేశారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

డోన్ టౌన్ : ఈ నెల 7న కోడుమూరు పట్టణంలో జరిగే రాష్ట్ర కుర్ని (నేసే)సంక్షేమ సంఘం ప్రథమ మహాసభకు డోన్ మండల కుర్ని సంఘీయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం డోన్ అధ్యక్షుడు బందికె హరి ప్రసాద్ బాబు, క్రియాశీలక సభ్యులు శ్రీనివాసులు, మహాసభ నిర్వాహకులు కర్నూలు జిల్లా కుర్ని సంఘం కార్యదర్శి గోట్ల రుషేంద్ర, సహాయ కార్యదర్శి సి బి చంద్రశేఖర్, కోశాధికారి హనుమంతప్ప పిలుపునిచ్చారు. స్థానిక వెంకటాచలం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కుల వృత్తిగా నమ్ముకొని జీవిస్తున్న నేసే కులస్థులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు.

రహదారిపైనే మురుగునీరు



రోడ్డుపై ప్రవాహిస్తున్న మురుగు నీరు

బనగానపల్లె : పట్టణంలోని కొండపేటలోని చక్రవర్తి ఫంక్షన్‌హాల్ సమీపంలోని సిమెంట్ రహదారిపై మురుగునీటి ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. రహదారి పక్క భాగంలోని డ్రైనేజీ పూడిక వల్ల నీరు రోడ్డుపైకి వస్తోంది. డ్రైనేజీలో పూడికను తొలగించంలో గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఇక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన చర్యలు తీసుకొని కాలువలో పూడికను తొలగించి రహదారిపై నీటి ప్రవాహం లేకుండా చేయాలని కోరుతున్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ..

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి. వెంకట బసవరావు ఆదివారం పూజలు నిర్వహించారు. స్వామి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ ఎరమల మధు, వేదపండితులు రవిశంకర అవధాని స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక కల్యాణ మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. వారి వెంట డాక్టర్ రామకృష్ణారెడ్డి ఉన్నారు.



చీని చెట్లపై పడిన దుమ్మును చూపుతున్న రైతు సత్యనారాయణరెడ్డి

బ్లాస్టింగ్‌తో చీనీ తోటలపై దుమ్ము

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలో నిర్మాణంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన మైనింగ్‌లో బ్లాస్టింగ్ చేస్తుండటంతో సమీపంలోని చీనీ తోటపై దుమ్ము ప్రభావం అధికంగా చూపుతోంది. గ్రామానికి చెందిన కొండారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి ముగ్గురు సోదరులు 15 ఏళ్ల క్రితం పది ఎకరాల్లో 1400 చీనీ చెట్లను నాటారు. నెలన్నర క్రితం అల్ట్రాటెక్ సిమెంట్ ఆధ్వర్యంలో చీనీ తోటకు సమీపంలోనే మైనింగ్‌లో భాగంగా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ చేస్తున్నారు. దీంతో దుమ్ము పెద్ద ఎత్తున చీనీ చెట్లపై పడుతుందని రైతులు వాపోతున్నారు. చెట్లకు ఇగురు వచ్చే సమయంలో దుమ్ము పెద్ద ఎత్తున చేరడంతో ఆకులు ముడుచుకుపోతున్నాయన్నారు. కాపుకు వచ్చిన సమయంలో ఈవిధంగా చోటు చేసుకోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ విషయం ఫ్యాక్టరీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తోటను పూర్తిగా వదిలిపెట్టే పరిస్థితి నెలకొందన్నారు.

పార్టీ మారి విమర్శలు చేయడం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి

బేతంచెర్ల: మండలపరిధిలోని తవిసికొండ గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి భర్త వెంకటేశ్వర్ రెడ్డి తన స్వార్థం కోసం వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి చేరి వైఎస్సార్‌సీపీ హయాంలో తమ గ్రామంలో అభివృద్ధి జరగలేదని విమర్శించడం మంచి పద్ధతి కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీ కృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌లో ఉండి గ్రామ సర్పంచ్‌గా ఓడిపోయి వైఎస్సార్‌సీపీలోకి చేరి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో నీ భార్య లక్ష్మీదేవి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికైన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తవిసి కొండ గ్రామ పంచాయతీ పరిధిలోనే రూ.3 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, పొలాలకు రహదారులతో పాటు కుంటల అభివృద్ధితో పాటు గ్రామానికి గోరుకల్లు రిజర్వాయర్ నీటిని తీసుకురావడం జరిగిందన్నారు. ఇంత అభివృద్ధి నీ కళ్లకు కనిపించలేదా అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌గా మండలంలోని ఆయా గ్రామాల్లో మరో రూ.7 కోట్ల కాంట్రాక్ట్ పనులు చేసుకొని వైఎస్సార్‌సీపీ హయాంలో తనకు ఏమీ లబ్ధిజరగలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ సంపాదన కోసం రాజకీయాలు చేస్తూ టీడీపీలోకి వెళ్లి వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎద్దులన్న పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించండి



నిధుల మంజూరుపై వాగ్వాదం చేసుకుంటున్న సర్పంచ్‌లు

బేతంచెర్ల : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షతన, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను వినిపించారు. అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయడమే కాకుండా, భూముల ఆన్‌లైన్, ఇనాం భూముల సమస్యల పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పట్టా భూములున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసి, డీ పట్టా భూములకు ఇవ్వకపోతే పేద రైతుల పరిస్థితి ఏంటని ఎంపీటీసీ మునేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఏఓ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని, ఈనెల 11వ తేదీ నుంచి ఫిర్యాదులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్, ఈనాం భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయండి

ఏడాది కాలంగా 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, చిన్న చిన్న మరమ్మతు పనులు కూడా చేయలేకపోతున్నామని డోన్ నియోజకవర్గం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిట్టె వేణుగోపాల్ రెడ్డి అన్నారు. నిధులు మంజూరు చేసి గ్రామ పంచాయతీలను బతికించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్‌కు సర్పంచ్ లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, గుమ్మగాల్ల రాజు, ఏస్తేరమ్మ, రామక్క, లక్ష్మిదేవి వినతి పత్రం అందజేశారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో కూడా నిధులు మంజూరు కాలేదని టీడీపీ సర్పంచ్‌లు శ్రీనివాసులు, నాగరాజు చెప్పడంతో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, ఎంపీటీసీ మునేశ్వర్ రెడ్డి అభ్యంతరం తెలిపారు. దీంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఎంపీటీసీలకు ఏడాదికిపైగా గౌరవ వేతనాలు ఇవ్వకపోగా, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు కూడా వర్తింపజయడం లేదని కోఆప్షన్ సభ్యులు రహంతుల్లా, ఎంపీటీసీ మునేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మల్లికార్జున, సూపరింటెండెంట్ దస్తగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్యే కాటసాని



వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. స్థానిక సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వరరెడ్డి కుమారుడి వివాహ కార్యక్రమంలో పాల్గొన్ని నూతన వధువరులను ఆశీర్వదించారు. అలాగే గృహ ప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్, కోవెలకుంట్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బీవీ నాగార్జునరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గ్రామ దేవత పెద్దమ్మకు బిందెలతో జలాభిషేకం నిర్వహిస్తున్న యువకులు

వర్షం కోసం గంగమ్మకు పూజలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పెద్దరాజుపాళెం గ్రామంలో గ్రామ పెద్దలు, యువకులు వర్షం కోసం గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఆదివారం గ్రామానికి చెందిన తొమ్మిది మంది యువకులు ఉపవాసదీక్ష పాటిస్తూ గ్రామంలోని ఆంజనేయస్వామి, బంగారమ్మ, సత్యమ్మలకు తొమ్మిది బిందెలతో నీళ్ల తెచ్చి పూజలు చేశారు. అనంతరం గ్రామ దేవత పెద్దమ్మకు 101 బిందెల నీటితో అభిషేకం, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. యువకులు గ్రామ సమీపంలోని జుర్రేరువాగులో గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి, ప్రసాదం స్వీకరించి ఉపవాసదీక్షను విరమించారు.

సర్పంచ్‌ల సమస్యలపై ధర్నా

కొలిమిగుండ్ల: సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 5న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు పార్టీలకతీతంగా అన్ని పంచాయితీల నుంచి సర్పంచ్‌లు తరలిరావాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు రెండు విడతలుగా మంజూరు చేసిన రూ.2వేల కోట్ల నిధులను సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకుందన్నారు. పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి ఆగిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న నిధులతో పాటు సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యపై చేపట్టే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వ పై శిథిలావస్థలో వంతెన

శిథిలావస్థలో వంతెన

బనగానపల్లె : పట్టణ సమీపంలోని తెలుగుపేట వద్ద ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వపై నిర్మించిన వంతెన ఇరుకుగా ఉండి పతనావస్థకు చేరడంతో ప్రమాదం పొంచి ఉన్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారిపై మౌలాలీ కొండపై భాగంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, మరిన్ని ఆలయాలకు వాహనాలు, కాలినడకన భక్తులు వెళ్తుంటారు. ఇంకా రవ్వలకొండపైనే ఇందిరమ్మకాలనీతో పాటు మోడల్ స్కూల్, బీసీ హాస్టల్ ఉన్నందున విద్యార్థులు నిత్యం వెళ్తుంటారు. చాలా కాలం క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరినా మరమ్మతులు చేయించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వంతెనను వెడల్పుగా మార్చి, మరమ్మతులు చేయించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.